క్లుప్తంగా

వైభవంగా కోటి దీపోత్సవం



తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో దీపాలంకరణ సేవ

కొత్తపల్లి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయంలో శనివారం కోటి దీపోత్సవం (దీపాలంకరణ సేవ) నిర్వహించారు. అమ్మవారి ఆకారంలో పూలతో అలంకరించి దీపాలను వెలిగించారు. పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దీపాలు వెలిగించేందుకు భక్తులు పోటీ పడ్డారు.

శృంగార వల్లభుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



తిరుపతి శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: తొలి తిరుపతి స్వయంభూ శృంగార వల్లభుని ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఈఓ పులి నారాయణమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన శాల ద్వారా స్వామివారికి రూ.5.11 లక్షల ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు ఆధ్వర్యంలో దాతలకు స్వామివారి చిత్రపటాలను అందజేశారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. ఎంపీటీసీ సభ్యుడు కుంచె బుచ్చిరాజు పాల్గొన్నారు.

సామాజిక సాధికార యాత్ర వాయిదా

సామర్లకోట: పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో 11న జరగాల్సిన సామాజిక సాధికార బస్సు యాత్ర వాయిదా పడిందని వైఎస్సార్‌ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు గమనించాలన్నారు.

పేదలకు వస్త్రదానం



పేదలకు వస్త్రదానం చేసిన దేశిన సత్యనారాయణ కుటుంబ సభ్యులు

సామర్లకోట: వేట్లపాలెంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తిక మాసం కావడంతో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గ్రామానికి చెందిన దేశిన సత్యనారాయణ వంద మంది పేదలకు వస్త్రదానం చేశారు. 20 ఏళ్లుగా ప్రతి ఏడాది కార్తిక మాసం చివరి శనివారం పేదలకు వస్త్రదానం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు, పారిశ్రామిక వేత్త గోలి ధర్మరాజు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

300 మందికి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు



క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తపల్లి: గొల్లప్రోలులో క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో శనివారం ట్రినిటీ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆల్ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రిక్కి గూటం పర్యవేక్షణలో స్థానిక ఆర్‌సీహెచ్ మైదానంలో మెగా క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సిబ్బంది సుమారు 300 మందికి పరీక్షలు చేసి రోగులకు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైద్యులు గోపాల్, అమృత, తన్మయి, హాసిని రోగులకు పరీక్షలు చేశారు. క్రీస్తు సంఘం సేవకులు మడికి జోయల్ రాజు, వైసీత్రీ యూత్ సభ్యులను పలువురు అభినందించారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రెటి మంగతాయారు, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ ప్రారంభించారు. ఆర్‌సీఎం చర్చి పాస్టర్ బర్తలోమియా, జీ.ప్రేమానందం, జాషువా, జి.ప్రవీణ్, కౌన్సిలర్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతిమార్గంలో నడుచుకోవాలి

పిఠాపురం: ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన శాంతి మార్గంలో నడుచుకోవాలని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పట్టణంలో ఉన్న ఆంధ్రాబాప్టిస్టు సెంటినరీ చర్చి ఆధ్వర్యంలో శనివారం ఫీల్డ్ కౌన్సిల్ క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యేను పాస్టర్లు సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రభుత్వంలో పాస్టర్లకు గౌరవవేతనం ఇస్తున్నారని, వారి అభివృద్ధికి సహకరిస్తున్నారని అన్నారు. ఏబీసీ సంఘం అధ్యక్షుడు గుబ్బల సాల్మన్‌రాజు, కార్యదర్శి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



వీకే రాయపురం ఏలేరు కాలువలో కాజ్‌వే మీదుగా పారుతున్న వరద నీరు

కాజ్‌వే లేదు

- వరద నీటితో రైతుల అవస్థలు
- 'ఏలేరు' ఆవలి ఉత్పత్తులకు రవాణా సమస్య
- యుద్ధ ప్రాతిపదికన చర్యలు

సామర్లకోట: ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. వీకే రాయపురంలో ఏలేరు కాలువపై వంతెన నిర్మాణంతో పాటు కాజ్‌వేపై గత పాలకులు దృష్టి పెట్టక పోవడం రైతులకు సమస్యగా మారింది. ఈ కాజ్‌వే మరమ్మతులకు గత ఏడాది రూ.6.65 లక్షలు, నెల రోజుల క్రితం రూ.1.43 లక్షలను కలెక్టర్ విడుదల చేశారు. కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు చేసిన తరుణంలో ఏలేరు నీరు ఉధృతంగా రావడంతో కాజ్‌వే శిథిలమైంది. దీంతో పంట రవాణాకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఏలేరు కాలువ ఆవలి వైపు వీకే రాయపురం, జగ్గమ్మగారిపేట, భీమవరం గ్రామాలకు చెందిన సుమారు 800 మంది రైతులకు చెందిన సుమారు మూడు వేల ఎకరాల పంట భూములున్నాయి. ప్రస్తుతం పంట కోత దశలో ఉండి రవాణాకు అవకాశం లేకపోవడంతో ఆటోల ద్వారా ధాన్యం రవాణా చేస్తే చార్జీలు చెల్లించడానికి అధికారులు ముందుకు వచ్చారు. అయితే తమ మధ్య విభేదాలు తలెత్తకుండా రవాణాకు కాజ్‌వే మీదుగా బాట వేసుకునే అవకాశం కల్పించాలని, ఇందుకు సుమారు రూ.1.5 లక్షలు అవుతుందని రైతులు వివరించారు. దానికి రెవెన్యూ అధికారుల కూడా అంగీకరించినట్లు తెలిసింది.

ప్రత్యేక దృష్టి పెట్టాలి



ఏడాది కాలంలో కాజ్‌వేకు సుమారు రూ.10 లక్షలు వ్యయమైంది. గ్రావెల్‌తో కాకుండా సిమెంట కాంక్రీట్‌తో నిర్మిస్తే కొంత కాలం నిలబడే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పంట రవాణాకు కాజ్‌వే మీదుగా బాట ఏర్పాటు చేయాలని కోరాము. కాజ్‌వే పరిస్థితిని వ్యసాయాధికారులు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి పరిశీలించారు.

– తలారి దొరబాబు, రైతు, వీకే రాయపురం

కలెక్టర్‌కు వివరిస్తాం



కాజ్‌వే పరిస్థితిని కలెక్టర్‌కు వివరించాం. పంట రవాణాకు మార్గం ఏర్పాటు చేయాలని ఆమె సూచించి నిదుల విడుదలకు అంగీకరించారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

– ఎస్ఎల్‌వీ కుమారి, తహసీల్దార్, సామర్లకోట

రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం



వాకతిప్పలో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- ముంపు పొలాల పరిశీలన

కొత్తపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలో వాకతిప్పలో శనివారం ఆయన పర్యటించారు. వర్షానికి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తడంతో నియోజకవర్గంలోని లోతట్టు గ్రామాలు, పంట పొలాలు నీట మునిగాయన్నారు. ఏలేరు ప్రాజెక్ట్ నుంచి వరదనీటిని ఒక్కసారిగా విడుదల చేయడమే ఈ అనర్థానికి కారణమన్నారు. నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్టు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. నియోజకవర్గంలో పంట నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలకు తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు అధైర్య పడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, మండల అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయశాఖ అధికారి జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు పంట నష్ట పరిహారం



అరటి తోటను పరిశీలిస్తున్న డీహెచ్‌ఓ మల్లికార్జునరావు

పెద్దాపురం: పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పంట నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని కాకినాడ జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎన్.మల్లికార్జునరావు అన్నారు. శనివారం ఉద్యాన శాఖాధికారి సుజాత, దుంప పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త జానకిలతో కలసి ఆయన పెద్దాపురం అర్బన్, మండలంలోని జె.తిమ్మాపురం గ్రామాల్లో దుంప, అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ తుపాన్‌తో కురిసిన వర్షాలకు రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులు అధైర్యపడాల్సిన పనిలేదన్నారు. 33 శాతం పైబడి నష్టపోయిన ప్రతి ఎకరాన్ని గుర్తించాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. రైతులు తమ సమీపంలోని ఆర్‌బీకేల వద్ద తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వీహెచ్ఏలు సత్యనారాయణ, జ్యోతి, విష్ణు, వీఏఏలు పాల్గొన్నారు.

జోరుగా ధాన్యం సేకరణ



కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకూ రైతు భరోసా కేంద్రాల ద్వారా 5 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి వి.జోగిరాజు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలును శనివారం ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ ధాన్యం కొనుగోలు జరుగుతోందన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది పొలాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. హమాలీ, తరలింపు చార్జీలతో పాటు సంచులను ప్రభుత్వమే అందిస్తోందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు.

భీమేశ్వరుని దయతో మరింత సేవ



ఆడుదాం ఆంధ్రా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి రోజా, దొరబాబు

- రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి రోజా
- పంచారామ క్షేత్రం సందర్శన

సామర్లకోట: పంచారామ క్షేత్రాల దర్శనంలో భాగంగా రాష్ట్ర పర్యాటక మంత్రి ఆర్‌కే రోజా శనివారం స్థానిక క్షేత్రంలోని కుమారా రామ భీమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈఓ టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల పూజల అనంతరం పండితులు రోజాకు వేదాశీర్వచనం చేశారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆమెను అమ్మవారి ఫొటో అందజేశారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జగనన్నే మళ్లీ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని స్వామి వారిని కోరుకున్నట్టు తెలిపారు. ఏటా స్వామివారిని దర్శించుకుంటానని, స్వామి ఆశీస్సులు ఉంటే ఎంత దూరమైనా వెళ్లి ప్రజా సేవా చేయడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో తామంతా సేవ చేసేలా ఆశీస్సులు ఇవ్వాలని కొరుకున్నాని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ముఖ్యమైన ఆలయాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.



మంత్రి రోజాను సత్కరిస్తున్న దవులూరి దొరబాబు, ఆలయ పండితులు, అధికారులు

'ఆడుదాం ఆంధ్రా' జయప్రదం చేయాలి

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను జయప్రదం చేయాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి ఆర్కె రోజా అన్నారు. పంచారామ క్షేత్రంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబుతో కలసి ఆడుదాం ఆంధ్రా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ క్రీడా పోటీలకు అర్హులన్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం అవుతున్న క్రీడా పోటీలకు యువతీ, యువకులతో పాటు వయసుతో సంబంధం లేకుండా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. సచివాలయ స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఈ పోటీలు ఫిబ్రవరి 3వ తేదీ వరకూ జరుగుతాయని చెప్పారు.

ఐక్యతకు వన సమారాధనలు దోహదం

పెద్దాపురం: ఐక్యతను చాటేందుకు కార్తిక వన సమారాధనలు ఎంతగానో దోహదపడతాయని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, జగ్గంపేట, పెద్దాపురం ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, నిమ్మకాయల చినరాజప్ప, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు అన్నారు. శనివారం పట్టణంలో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తిక వన సమారాధనకు వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దొరబాబు, ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ కాపులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందన్నారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కాపు కార్పొరేషన్ ద్వారా పలు పథకాలు అమలు చేస్తుందన్నారు. కాపులందరికీ తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, తాడి రాజగోపాలరావు, పసుపులేటి సాయిబాబు, పేర్నీడి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



దవులూరికి స్వాగతం పలుకుతున్న కాపు సంఘ నాయకులు

17న వైఎంసీఏ ఆధ్వర్యంలో పాటలు, క్విజ్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): యంగ్‌మెన్ క్రిస్టియన్ అసోసియేషన్(వైఎంసీఏ) కాకినాడ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న క్రిస్మస్ పాటలు, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు శాఖ అధ్యక్షుడు హెన్రీ, కార్యదర్శి గాంధీ శనివారం తెలిపారు. స్థానిక రామారావు పేటలోని సెయింట్ జాన్స్ లూథరన్ చర్చిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమవుతాయన్నారు. 30 ఏళ్ల లోపు వారు ఈ పోటీకి అర్హులన్నారు. పాటల పోటీలు వ్యక్తిగత, గ్రూప్ విభాగంలో జరుగుతాయన్నారు. విజేతలకు ఈ నెల 28న సిటీ టేబర్నికల్ చర్చిలో జరిగే వైఎంసీఏ క్రిస్మస్ వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 95358 68625, 98484 03492 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

చురుగ్గా నష్టం అంచనాలు

- మండలంలో 200 ఎకరాల పంట నష్టం
- సర్వే చేసేందుకు ప్రత్యేక బృందాలు
- ఆన్‌లైన్‌లో నష్టపోయిన రైతుల వివరాలు

కొత్తపల్లి: ఏలేరు, పీబీసీ వరద ఉధృతి, ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రైతులు తీవ్రంగా నష్ట పోయారు. ముఖ్యంగా వాకతిప్ప, నాగులాపల్లి, ఎండపల్లి, ఇసుకపల్లి, రమణక్కపేట గ్రామల్లో అధికంగా పంట నష్టం వాటిల్లింది. మండలంలో సుమారు రెండు వేల ఎకరాలు పంటనష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటికీ పలు గ్రామాల్లో పంట పొలాలు పూర్తిగా ముంపులోనే ఉన్నాయి. నీట మునిగిన వరి పొలాలు పూర్తిగా కుళ్లిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని పలు ప్రధాన కాలువలు పొంగిపొర్లుతున్నాయి.



పిఠాపురంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న అధికారులు



యండపల్లిలో మునిగిపోయిన వరి కంకులను చూపిస్తున్న రైతులు

ప్రత్యేక బృందం ఏర్పాటు

వరద ఉధృతితో ముంపునకు గురైన పంటలను గుర్తించేందుకు ఉన్నతస్థాయి అధికారులను ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ బృందంలో గ్రామ రెవిన్యూ అధికారి, రెవెన్యూ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సచివాలయ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు ఉంటారు. ఆయా గ్రామాల్లో జరిగే పంట నష్టాన్ని అంచనావేసి ఆన్‌లైన్ చేస్తారు.

అధికారులకు అందించాల్సిన పత్రాలు

పంట నష్టపోయిన రైతులు అధికారులకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, బ్యాంక్ ఎకౌంట్ జెరాక్స్‌లు, కౌలు రైతులకు ప్రభుత్వం అందించిన కౌలు కార్డులతో పాటు ఆధార్, బ్యాంక్ అకౌంట్ జెరాక్స్‌లను అందజేయాలి.

పూర్తి స్థాయిలో సర్వే

ముంపునకు గురైె నష్టపోయిన వరి పొలాలను పూర్తి స్థాయిలో సర్వే చేస్తాం. ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో బృందాలను ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే ముంపు ప్రాంతాలకు వెళ్లి పంటలను పరిశీలిస్తున్నాం. నష్టపోయిన ప్రతి రైతు, కౌలురైతు వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తాం. దీనిపై రైతులు అధికారులకు సహకరించాలి.

జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి



ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

250 హెక్టార్లలో ఉద్యాన పంట నష్టం

పిఠాపురం: తుఫాన్ కారణంగా నియోజకవర్గంలో సుమారు 250 హెక్టార్లలో ఉద్యాన వన పంటలకు నష్టం వాటిల్లినట్లు ఉద్యనవన శాఖ అధికారి శైలజ తెలిపారు. గొల్లప్రోలు, కొత్తపల్లి, పిఠాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న ఉద్యాన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొల్లప్రోలు మండలంలో పలు రకాల కూరగాయల పంటలు 200 హెక్టార్లు, పిఠాపురం మండలంలో అరటి 40 హెక్టార్లలో అరటి పంటకు నష్టం, పామాయిల్ చెట్లు 200 పడిపోయాయి. బొబ్బాయి ఒక హెక్టార్, కూరగాయల పంట మూడు హెక్టార్లు, కొత్తపల్లి మండంలో అరటి, మామిడి, జామ 10 హెక్టార్లలో నష్టం వాటిల్లిందన్నారు. నష్టాన్ని పూర్తి స్థాయిలో అంచనాలు వేసి నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు నివేదిస్తామన్నారు.

నేడు జాతీయ స్థాయి కరాటే పోటీలు



కరాటే చాంపియన్ షిప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న లయన్స్ క్లబ్, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎన్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెండో జాతీయ స్థాయి కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ డి.శంకరరావు తెలిపారు. శనివారం టోర్నమెంట్‌కు సంబంధించిన ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 10 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు, కరాటే కోచ్‌లు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకూ పోటీలు జరుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెల్లూరు సూర్యనారాయణ, జిల్లా మొదటి గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, రెండో గవర్నర్ వి.కోటేశ్వరరావు, మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పాల్గొని బహుమతులు అందజేస్తారని తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి, కరాటే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ఎస్ మూర్తి, ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు బి.రామారావు, ఎం.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు కూలీల ధర్నా



పులిమేరులో ధర్నా చేస్తున్న రైతు కూలీలు

పెద్దాపురం: జగ్గంపేట మండలం గుర్రంపాలెంలో సీలింగ్ భూములను పెత్తందారులకు కట్టబెట్టే ప్రయత్నం మానుకోవాలని కోరుతూ ఏపీ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో శనివారం పులిమేరులో రైతు కూలీలు ధర్నా చేశారు. ఏపీ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ 20 ఏళ్లుగా తమ సాగులో ఉన్న భూముల్లో హెచ్చరిక బోర్డులు తొలగించి, తమకే పట్టాలివ్వాలన్నారు. పెత్తందారులకు మద్దతుగా నిలుస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో దేశెట్టి సురేష్, వల్లూరి రాజుబాబు, డి.సురేష్, చార్లెస్, ముసిలి బాబు, నాగేశ్వరరావు, నాగభూషణం, అన్నవరం, శివాజీ, సత్తిబాబు, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని విన్నకోట సురేష్ తెలిపారు. షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు ఇస్తామన్నారు. 108 అంబులెన్స్‌లో పని చేస్తున్న సురేష్ ప్రతి ఆదివారం ఉచితంగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తూ తన వంతు సహకారం అందిస్తున్నారు.

ఆకట్టుకున్న జ్యోతిర్లింగార్చన



సామర్లకోట పంచారామ క్షేత్రంలో జ్యోతిర్లింగార్చన

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరీ సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి జ్యోతిర్లింగార్చన జరిగింది. ఆలయంలో లక్షపత్రి పూజలు చేసుకున్న భక్తులకు దీపారాధన సంఘ సభ్యులు జ్యోతిర్లింగార్చన ఏర్పాటు చేశారు. ఆలయంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించిన తరువాత జ్యోతిర్లింగార్చనలో దీపాలు వెలిగించారు. దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ట్రస్టు బోర్డు సభ్యుడు యండమూరి తదితరులు పాల్గొన్నారు. దీపారాధన సంఘం ఆధ్వర్యంలో 12న మధ్యాహ్నం అన్నదానం జరుగుతుందని సంఘ సభ్యులు తెలిపారు.

నేడు అథ్లెటిక్స్‌కు ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక నిర్వహిస్తున్నారు. సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు శనివారం మాట్లాడుతూ అండర్-14, 16 బాలుర, బాలికల విభాగంలో జిల్లా క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమౌతాయన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు అండగా ఉంటాం

కాకినాడ సిటీ: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు అన్ని విధాలా సహకరిస్తామని ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం సభ్యులతో సమావేశమైన ఆయన వారి కుటుంబాల సంక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఏ సమస్య ఉన్నా తనను నేరుగా కలసి చెప్పవచ్చన్నారు. ఆరోగ్య పరంగా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.